



కునేవాళ్ళం. అప్పుడప్పుడు ఆ పూతక్రమ గద్దెలో దాచేసి తమాషాలు చేసి, నీలి ముఖంలోని ఆత్రతకూ నిస్పృహాయతకు నాలో నేను నవ్వుకునే వాణ్ని.

"ఏమండీ నీలికి కాలు వస్తే తప్పకుండా బాత్ రూం శాండల్స్ కొనిపెట్టాలండీ" అన్నా.

"అంటే" అమాయకంగా అడిగింది నీలి.

ఆమెకేసి చూస్తున్నవాణ్ని చప్పున నా జేబులోని చలవ కళ్ళజోడును తీసి బలవంతాన ఆమె ముఖానికి తొడుగుతూ- "చూడండి. మీఅమ్మాయి లేడీలా లేదూ?" అన్నాను.

నీలి చేత్తో అద్దాల్ని తీయబోయింది.

"చెబుతున్నా- తీశావా మళ్ళీ నీకూ నాకూ పేచీ వస్తుంది" అని కసిరాను.

'అమ్మా మరైతే అద్దం తెచ్చిపెట్టవే, ఎట్లా గుందో చూసుకోవాలి" అంది.

ముసలమ్మగారు నవ్వుతూ లేచింది.

'నా ముఖం ఎట్లా వుందో యెదురుగుండా వున్నవాళ్ల ముఖమే అద్దంకన్నా స్పష్టంగా చెబుతుందన్నావుగా- మళ్ళీ అద్దం ఎందుకంటూ' యెత్తి పొడిచాను.

'నిజమే. నిజమేనే- అమ్మా! అద్దం అక్కర్లేదే-' అని గట్టిగా కేక పెట్టింది, ముందు పోతున్న తల్లికి వినపడేలా.

అంతలో హఠాత్తుగా మలుపు తిరిగి వస్తూన్న డాక్టరు చలవ అద్దాలు పెట్టుకున్న నీలిని ఆశ్చర్యంతో చూసి ఆగి 'ఏమమ్మాయ్? చాలా కులాసాగా వున్నావే?' అని నవ్వాడు.

నేను నమస్కరించాను. కంగారుగా కళ్ల అద్దాలు వూడదియ్యబోయింది. కాని ఒక ప్రక్క జుట్టులో చిక్కటంచేత నేనే ఆమెకు సాయం చేయవలసి వచ్చింది.

'మీరిద్దరూ యేమవుతారు?' అని డాక్టరు నీలిని అడగ్గానే నేను తెల్లబోయాను. నాకేసి చూసి నీలి తల వాల్చేసింది. అద్దం పుచ్చుకుని వస్తున్న ముసలమ్మగారు 'డాక్టరు బాబూ దండ'మంటూ చేతుల్ని జోడించింది. ఆయన ముందుకు అడుగులు వేస్తూ 'పెళ్ళికొడుకు దొరికాడా?' అని ప్రశ్నించాడు నవ్వుతూ.

'ఏది బాబూ తమరు కాలు యిచ్చాక గదా దాని అదృష్టాదృష్టాలు బయటపడేది?' అని ముసలమ్మగారు చెప్పింది.

ఆమెకేసి చూసినంతసేపూ ప్రశ్నించుకున్నాను - యీమె నాకేం కావాలని? నీ...లి...నా...కే... మీ...కా...దు. ఈ మిసమిసలాడే పిల్లా వెనుకటి ఆ వికారమైన రూపూ, రోజారంగు పిల్లా— యేదీ సత్యం కాదు. ఇహ నుంచి యేం చేసినా నిష్కామకర్మగానే చేయాలనే తీవ్ర నిర్ణయానికొచ్చేశాను.

